# ఉపాధి!


కథ

## నెమలూరి భాస్కరరావు

అదొక చిన్న టౌన్. 3 లక్షల మంది జనాభా గల ఎ-గ్రేడ్ మున్సిపాలిటీ. అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ఆ వూరి ఎమ్మెల్యేగా ఇప్పటికి మూడుసార్లు గెలిచి, మంత్రివర్గంలో ఓ శాఖకు మంత్రిగా కూడా వెలిగిపోతున్నాడు. రెండెకరాల రైతు కుటుంబంలోంచి వచ్చిన ఆయన, ఈ పదిహేనేళ్ళలో 200 కోట్లు సంపాదించి, భారతదేశం వెలిగిపోతోంది అనే ప్రచారానికే మాడల్‌గా మారిపోయాడు. వరల్డ్ బ్యాంక్ పుణ్యమా అని ఆయన ఆ వూరికి అన్నీ తారు రోడ్లు వేయించాడు. రోడ్ల మధ్యలో డివైడర్స్ వేయించాడు. పోనీ ఆ డివైడైర్‌లో కూర్చుని అరటిపళ్ళు అమ్ముకుందాం అనేవాడికి ఆ ఛాన్స్ ఇవ్వకుండా డివైడర్స్ మధ్యలో పూలమొక్కలు వేయించాడు.

దాంతో అనేక వేలమంది హాకర్స్ తమ ఉపాధి కోల్పోయారు.

ఆయన బంగ్లాకు సమీపంలో ఉన్న రోడ్డుమీద, ఆయన చాలా స్థలాలు కొన్నాడు. తన స్థలాల దగ్గర ఎండ్ అయ్యే మాదిరిగా దూరం నుంచీ, అదీ మంచి వ్యాపార సెంటర్ మధ్యనుంచీ ఓ ఫ్లయ్ ఓవర్ నిర్మించాడు. దాంతో ఆయన ఆయన స్థలాలకు కోట్ల రూపాయల ధర పెరిగింది. ఆయన బంగ్లా దగ్గరనుంచి, ఆయన స్థలాలు ఉన్నంత దూరం ఇప్పుడు పెద్ద వ్యాపార కూడలిగా మారిపోయింది.



ఆయన వున్న వూరికి పక్కనే గల కొండమీద ఓ పుణ్యక్షేత్రం వుంది. దాన్ని ప్రభుత్వ ధనం వందలకోట్లు ఖర్చు చేసి, అందులో సగం దిగమింగి దాన్నొక గొప్ప యాత్రాస్థలంగా మార్చాడు. ఈ పని చేస్తూనే ఆ యాత్రా స్థలానికి అటూ, ఇటూ, ఓ 150 ఎకరాల స్థలాన్ని చవగ్గా కొన్నాడు. యాత్రాస్థలమే కాక, దాన్ని టూరిస్ట్ ప్రాంతంగా కూడా మార్చాడు. అక్కడో జింకల పార్కు, పిల్లల పార్కు, టూరిస్ట్ గెస్ట్ హౌస్- లాంటివి ఏర్పాటు చేశాడు. దాంతో ఆయన కొన్న పొలాలు ప్లాట్స్ చేశాడు. బేరం పెట్టాడు. కొన్ని వందల కోట్లు ఆ విధంగా లాభాలు.

ముస్లిమ్‌ల కోసం ఓ షాదీఖానా- మధ్యతరగతి వారి కోసం ఓ టౌన్ హాల్- తనే స్వయంగా ఓ హిందూ వివాహ మంటపం- వూరికి నాల్గువైపులా ఓ హరిజన కాలనీ-ఓ ఎరుకల కాలనీ- ఓ చాకలి కాలనీ- లాంటివి నిర్మించి, ఆ కాలనీవాసులకు గృహపథకాల కింద నివాసాలు సమకూర్చాడు. ఊరి చివర ఓ స్టేడియం కట్టించాడు కుర్రకారుకోసం. ఆ విధంగా ఆయన అన్ని కులాలు, వర్గాలవారిని తన ఓట్ల బ్యాంకుగా విజన్ 2020 పేరిట మార్చుకున్న చతురుడు.

అన్నింటికన్నా ముఖ్యం అతనికి కుల బలమూ వుంది, అవసరమైన సందర్భాల్లో రౌడీయిజాన్ని ఉపయోగించగల సమర్థతా- వయసూ కూడా వున్నాయి. అన్నట్లు చెప్పటం మర్చిపోయాను బ్రాహ్మణులకోసం ఓ దినాల సత్రం కూడా కట్టించాడు. ఈ పనులన్నీ ప్రపంచ బ్యాంకు నిధులతోనే ఏర్పాటు చేశాడు. ఈ పనులకు సంబంధించిన కాంట్రాక్టులన్నీ తన పార్టీ కార్యకర్తలకే వచ్చేలా చూశాడు. ఆ విధంగా వాళ్ళూ అపర కుబేరులుగా మారారు. ఊరంతా తారు రోడ్లు- సందుల్లో సిమెంటు రోడ్లు. అందానికేం కొందవలేదు- అన్నానికే.

ఇవే కాక వూరికి నాల్గువైపులా ఓ ఎరుకల కాలనీ- మాలమాదిగ కాలనీలు, చాకలి కాలనీలు నిర్మించాడు. మాలమాదిగలకు యస్‌సీ కార్పొరేషన్ ద్వారా కొందరికి శాంపిలుగా కొన్నికొన్ని చిన్నలోన్లు ఇప్పించాడు. ఎరుకల కాలనీవాసుల్లో కొందరికి రిక్షాలు ఇప్పించాడు. ఛాకలి కాలనీవాసుల్లో కొందరికి ఇస్త్రీబండి, పెట్టెలు ఇప్పించాడు. ఆ విధంగా అన్ని కులాలవారిని ఆకట్టుకున్నాడు.

నాయుళ్ళందరికీ కూరగాయల మార్కెట్‌లో కొట్లు- రైతు బజార్‌లో కొట్లు కేటాయించాడు. చౌదర్లందరికీ బార్లు, బ్రాందీ షాపులు- వాటిలో వాటాలూ- మున్సిపల్ కాంట్రాక్టులూ ఇప్పించాడు.

వరల్డ్ బ్యాంకువారి ఆదేశాల మేరకు ప్రజలకు పైపై హంగులన్నీ ఏర్పరచి, ఉపాధికి ఉపయోగపడే పరిశ్రమలు- కనీసం చిన్న చిన్న ఇండస్ట్రీస్ కూడా ఏర్పర్చకుండా జాగ్రత్తపడ్డాడు.

ప్రజలు అంతకుముందు నాల్గు సంవత్సరాలుగా వర్షాలు లేక- సాగునీరు- తాగునీరు దొరక్క తీవ్రక్షామంతో అతలాకుతలం అయిపోతుంటే, “దానికి కారణం తమ పార్టీ కాదనీ, అంతకుముందున్న ప్రభుత్వంవారి అవకతవక విధానాలే కారణం” అని బలంగా ప్రతి సభలోనూ నొక్కి చెప్పాడు.


ప్రపంచీకరణ కారణంగా రైతులు- చేలవృత్తుల వాళ్ళు- చిన్నచిన్న వ్యాపారస్థులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే, దీని గురించి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది అనీ, అయినా ప్రతిపక్షాలూ- మీడియా-గోరంతలు కొండంతలు చేసి తమ ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని వాపోతూ వుండేవాడు.

చాపకింద నీరులా వినియోగదారీ సంస్కృతి విస్తరించి, ప్రజల జేబుల్లో వున్న కాసిని రూపాయల్నీ మాయం చేయటం నిత్యకృత్యం అయిపోయింది.

బళ్ళు, సెల్‌ఫోన్లు- కూలర్స్- ఫ్రిజ్‌లు- కలర్‌టీవీలు- సి.డి. ప్లేయర్స్- అన్నీ అత్యవసరంగా మారిపోయాయి. ఆకర్షణీయమైన ఆఫర్లు, జీరో పర్సంట్‌మీద ఫైనాన్స్ సౌకర్యాలు రావటంతో, పులుల్ని చూసి నక్కలు వాతపెట్టుకోవటం ఎక్కువైపోయింది.

- ఇంక పిల్లల చదువుల సంగతి సరేసరి. అంతా కార్పొరేట్ విధంగా మారిపోయింది. చదువు 'కొనటం' అనేది కొత్త అర్థాన్ని సంతరించుకుంది.

సమాజం అంతటా అలుముకుంటున్న అమెరికన్ సంస్కృతిని, ఆ సంస్కృతికి వారసులైన దేశాలవారికి కావలసిన మౌలిక వసతులు, వారినుంచే రుణాలుపొంది, అందులో కొంత మింగేసి, కొంత వసతులకోసం వినియోగించి, వందకోట్ల జనాభా గల భారత విశాల భూభాగాన్ని విదేశాలకు మార్కెట్‌గా ద్వారాలు తెరిచి ఆహ్వానించింది ప్రభుత్వం.



ఫారిన్‌కార్లు-బళ్ళు, ఫారిన్ సరుకులు- అంతా ఫారిన్ మయం. ఇదంతా అభివృద్ధికాక మరేమిటి అని ఉపన్యాసాలు దంచి, వెంటనే ఈ ఫలితాన్ని సొమ్ము చేసుకోవటాన్కి మధ్యంతర ఎన్నికలు దేశం మొత్తానికి ప్రకటించింది ప్రభుత్వం.

ఇంకేం. మన స్థానిక యం.యల్.ఏ. రంగంలోకి దిగిపోయారు. తన శ్రేణులన్నిటినీ సమాయత్తం చేయటం ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో ఆ వూరి ఎరుకల కాలనీ ఎలా వుందో చూపించటమే ఈ కథ కాని యథార్థం.

***

ఆ ఎరుకల కాలనీకి మొత్తానికి కలిపి ఒకే ఒక బోరు పంపు- ఒక్క పబ్లిక్ మున్సిపల్ ట్యాపు ఉన్నాయి. ఉదయం అయిదు గంటలకల్లా ఆడవాళ్ళందరూ బోరు- ట్యాప్ నీళ్ళకోసం బిలబిల్లాడుతూ లేచిపోతారు. ప్రతిరోజూ బోరు దగ్గరా- ట్యాపు దగ్గరా చిన్నవీ, ఒక్కోసారి పెద్దవీ ఫైటింగ్ సీన్లు జరుగుతూనే వుంటాయి. నీటిధారకన్నా ధారాళంగా బూతులు ప్రవహిస్తుంటాయి. ఆ కాలనీ ఆడవాళ్ళందరూ ఇతరుల ఇళ్ళలో పనిమనుషులుగానూ- లేదా ఇళ్ళంబట తిరిగి యాచన చేసుకోవటాన్కి పరిమితం అయివుంటారు. మగవాళ్ళలో అధికశాతం మంది రిక్షా కార్మికులుగా పని చేస్తుంటారు. ఇంక ఇళ్ళలో వుండేది ముసలీ- ముతకా మాత్రమే. పగలంతా కాలనీ ప్రశాంతంగా- నిర్జీవంగా వుంటుంది. ఉదయం 5 గంటల నుంచి ఏడు గంటల వరకు, రాత్రి 8 గంటలనుంచీ అర్ధరాత్రి వరకు కోలాహలంగా గందరగోళంగా వుంటుంది.

మగవాళ్ళు ఏ పని చేసినా- ఎంత సంపాదించినా- వారి సంపాదన కుటుంబానికి ఖర్చు చేయాల్సిన అవసరం లేదు- చెయ్యరు- ఆడదే పాచిపని చేసో, అడుక్కుని వచ్చో మగవాడ్ని, పిల్లల్ని పోషించాలి. మాతృస్వామిక వ్యవస్థ తాలూకు అరాకొరా లక్షణాలు అక్కడ మిగిలేవున్నట్లున్నాయి బహుశా. ఆడపిల్లకు మగాడు ఎదురు కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకుంటాడు. దాన్ని ఓలి అని పిలుస్తారు. మగవాళ్ళ సంపాదన వాళ్ళ బీడీలు- సిగరెట్లు- టీలు-మందుకోసం ఖర్చు చేసుకుంటారు.

మగవాళ్ళు ఏ పని చేసినా- ఎంత సంపాదించినా- వారి సంపాదన కుటుంబానికి ఖర్చు చేయాల్సిన అవసరం లేదు- చెయ్యరు- ఆడదే పాచిపని చేసో, అడుక్కుని వచ్చో మగవాడ్ని, పిల్లల్ని పోషించాలి. మాతృస్వామిక వ్యవస్థ తాలూకు అరాకొరా లక్షణాలు అక్కడ మిగిలేవున్నట్లున్నాయి బహుశా. ఆడపిల్లకు మగాడు ఎదురు కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకుంటాడు. దాన్ని ఓలి అని పిలుస్తారు. మగవాళ్ళ సంపాదన వాళ్ళ బీడీలు- సిగరెట్లు- టీలు-మందుకోసం ఖర్చు చేసుకుంటారు. దయగల మగాడైతే ఇంట్లో ముసలి తండ్రికీ- భార్యకు కూడా ఎప్పుడేనా ఓసారి ఓ సారా ప్యాకెట్ గానీ, చీప్‌లిక్కర్ బాటిల్ గానీ తెచ్చి ఇచ్చి, వార్ని ఆనందపరుస్తుంటారు. చాలా మంది మగాళ్ళు చీటికి మాటికి భార్యల్ని చితగ్గొడుతూ వుంటారు. నా మొగుడితో వేగలేకుండా వున్నాను అని ఏ భార్య అయినా కులపెద్దల ముందు పంచాయితీ పెడితే పంచాయితీకి భార్యభర్త చెరో వంద రూపాయలూ ధరావత్ కట్టాలి. ఆ ధరావత్ సొమ్ముతో పెద్దలు ఫుల్‌గా మందుపార్టీ చేసుకుని, అప్పుడు తీర్పు చెప్పటాన్కి ఉపక్రమిస్తారు. సాధారణంగా తొంభయిశాతం తీర్పులు మగవారికే అనుకూలంగా చెపుతారు. "నువ్వు పనిచేసి డబ్బు సంపాదించకపోతే, అడుక్కొచ్చి అన్నం పెట్టకపోతే ఆడూ- పిల్లలూ-ఎలా బతకాలి? ఇయ్యన్నీ చేత్తావనే కదా ఆడు నిన్ను మనువాడింది?" అని పెద్దలు ఆడదాన్నే నిందిస్తారు. కాబట్టి ఆడు కొట్టినా- తిట్టినా- జ్వరంగా ఉన్నా- ఆఖరికి ఇంక రెండు రోజులకు పురుడు వస్తుంది అని తెలిసినా- పని- అడుక్కోవటం మాత్రం ఆపరు.

ఓ రోజు వాళ్ళ కాలనీ అంతా పోస్టర్లు అంటించారు ఎవరో. అందులో సారాంశం "భారత్ వెలిగిపోతోంది" అని. అదేంటో ఆ కాలనీవాసులకు తెలవదు- పట్టదు- పట్టించుకోరు. మూడోరోజుకల్లా పోస్టర్లు మేకలు- గొడ్లు- పీక్కుని తినేశాయి. కొన్నేమో పిల్లలు పీకేశారు.

***

ఉదయం ఆరు గంటలకల్లా అతికష్టంమీద వెంకటమ్మ ఇంటికి కావలసిన నీళ్ళన్నీ తెచ్చి పోసింది. గవర్నమెంటువారు కట్టి ఇచ్చిన అగ్గిపెట్టె లాంటి ఇంటి ముందు 62 ఏళ్ళున్న ఆమె భర్త కోటయ్య ఓ నులకమంచం మీద పడి నిద్ర పోతున్నాడు. మంచంకింద రాత్రి తాగిన ఖాళీ చీప్‌లిక్కర్ బాటిల్ పడి వుంది. ఇంట్లో ఓ పక్కన ఆమె ఒక్కగానొక్క కొడుకు లింగయ్య నేల మీదే పడి నిద్ర పోతున్నాడు. వాడి తల వెనక రెండు చీప్ లిక్కర్ బాటిల్స్ ఖాళీగా పడి వున్నాయి. ఆమె ఆ మూడు ఖాళీబాటిల్స్ తెచ్చి అపురూపంగా కిటికీలో దాచింది. ఇనప సామాన్లు కొనేవాళ్ళు వాటికి రూపాయో, అర్ధరూపాయో ఇస్తారు మరి. ఇంటిముందు తండ్రీ, కొడుకులిద్దరివీ రెండు అద్దె రిక్షాలు తమ డ్రైవర్లు ఎప్పుడు అధిరోహిస్తారాఅన్నట్లు ఎదురు చూస్తు న్నాయి. రెండు పార్టీల జండాలు రెంటికీ కట్టి వున్నాయి.

గత వారం రోజులుగా ఆమె భర్తా, కొడుకూ ఇద్దరూ రిక్షాలతో చెరో పార్టీకి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇద్దరికీ చెరో వందా ఇస్తున్నారు. ఉదయం- రాత్రి భోజనాలు- మందూ దొరుకుతున్నాయి. వెంకటమ్మ కూడా ఈ వారం రోజులుగా పాచిపనులకు గానీ- అడుక్కోవటాన్కి గానీ పోవటం లేదు. ఎన్నికల పుణ్యమా అని ఆమెకూ పని

పనికి కుదురుకున్న పార్టీ కార్యాలయానికి వెళ్తుంది. అక్కడ టిఫిన్- కాఫీలకు టికెట్ ఇస్తారు. ఆ పని అయ్యాక తనలాంటి పది- పదిహేను మందిని ఓ బ్యాచ్‌గా ఏర్పరచి, ఫలానా వార్డుకి వెళ్ళి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇంటింటికీ కరపత్రాలు పంచి, పార్టీకి ఓటెయ్యమని మరీ మరీ చెప్పి, ఆఫీసుకి రావాలి. పార్టీ టోపీ ఖచ్చితంగా ధరించి తిరగాలి. మధ్యాహ్నం భోజనం టికెట్ మళ్ళీ. భోజనం చేసి మళ్ళీ చర్విత చర్వణం. రాత్రి ఏడుగంటలకు పార్టీ ఆఫీసులో ఆ రోజు కూలి యాభై రూపాయలు ఇస్తారు. అవి తీసుకుని రాత్రి ఎనిమిది గంటల దాకా నాలుగు పేటల్లో అన్నం అడుక్కుని ఇంటికి చేరుకుంటుంది. ఆవిధంగా ఎన్నికల పుణ్యమా అని ఆమెకు రెండు పూటలా పాచిపని తప్పి, యాభై రూపాయలు క్యాష్ చేతిలో పడుతోంది.



ఆ విధంగా ఆమెకు కొంత పని నుంచి ఉపశమనం, వస్తున్న డబ్బుతో కొన్ని బాకీలైనా తీర్చవచ్చు అనే సంతృప్తి కలుగుతోంది.

పనికి కుదురుకున్న పార్టీ కార్యాలయానికి వెళ్తుంది. అక్కడ టిఫిన్- కాఫీలకు టికెట్ ఇస్తారు. ఆ పని అయ్యాక తనలాంటి పది- పదిహేను మందిని ఓ బ్యాచ్‌గా ఏర్పరచి, ఫలానా వార్డుకి వెళ్ళి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇంటింటికీ కరపత్రాలు పంచి, పార్టీకి ఓటెయ్యమని మరీ మరీ చెప్పి, ఆఫీసుకి రావాలి. పార్టీ టోపీ ఖచ్చితంగా ధరించి తిరగాలి. మధ్యాహ్నం భోజనం టికెట్ మళ్ళీ. భోజనం చేసి మళ్ళీ చర్విత చర్వణం.

ఒసారి ఆమె భర్తకు రోగం వస్తే వెయ్యి రూపాయలు వడ్డీకి తెచ్చి మందులు ఇప్పించింది. అసలు ఎటూ తీర్చలేకపోయినా వడ్డీ కట్టటమే తలకు మించిన భారంగా తయారయింది. భర్తా- కొడుకూ ఒక్క పైసా ఇవ్వరు. ఎన్నికల పుణ్యమా అని భర్తా- కొడుకూ కలిపి ఓ ఆరువందల రూపాయలదాకా ఇచ్చారు. మిగతా నాలుగు వందలూ తనకు రోజూ వచ్చే యాభై రూపాయలద్వారా పూడ్చి, ఆ వెయ్యి రూపాయల బాకీ తీర్చేసింది. ఎన్నికలే రాకపోతే తనీ జన్మకు ఆ వెయ్యి రూపాయలూ తీర్చలేకపోదును కదా అని కూడా అనుకుంది.

ఏడు గంటలకల్లా కాలనీ బైట వున్న టీ షాప్ దగ్గరకు వెళ్ళి, ఓ టిఫిన్‌లో మూడు టీలు పోయించుకుని తిరిగి వచ్చింది. ఆమె వచ్చేసరికల్లా భర్తా, కొడుకూ లేచి, చెరో పుల్లా నమిలి, నోళ్ళు పుక్కిలించి, ముఖాలు కడుక్కుని రడీగా ఉన్నారు. రాత్రెంత మందు తాగినా తెల్లారి ఏడు గంటలకల్లా లేచి తయారైపోతున్నారు తండ్రీ కొడుకులు. మామూలు రోజుల్లో అయితే లేవనే లేవరు, లేపి, లేపి, తన వూపిరి పోవటం తప్ప. వాళ్ళు టీ తాగి, కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం అయిందనిపించి, రిక్షాలు తీసుకుని బయలుదేరారు. ఈ వ్యవహారం అంతా పూర్తి అయ్యేసరికి కాలనీ ఆడవాళ్ళంతా బయలుదేరనే బయలుదేరారు. వెంకటమ్మ కూడా టోపీ ధరించి వాళ్ళతోపాటు ఎన్నికల కార్యాలయానికి బయలుదేరింది.

***

ఆడవాళ్ళు- మగవాళ్ళు- ఇంటింటికీ వార్డుల్లో బిలబిల్లాడుతూ తిరుగుతున్నారు. ఆడాళ్ళకు కుంకంబొట్లు పెట్టి జాకెట్ గుడ్డలూ- చీరలూ- పంచుతున్నారు. ఇంక ప్రచారానికి రేపొక్కరోజే తుదిరోజు. అందువల్ల అంతా హడావిడి- వురుకులు- పరుగులు- జోరుగా- హుషారుగా అన్ని పార్టీలూ ప్రచారం నిర్వహిస్తున్నాయి. డబ్బులోనూ- అంగబలంలోనూ వీక్‌గా వున్న పార్టీల ప్రచారం ఎవర్నీ ఆకర్షించలేకపోతోంది. ప్రధానంగా రెండు పార్టీలమధ్యే ప్రచారం- పోటీ తీవ్రంగా నడుస్తోంది. ఆరోజు ప్రచారం రాత్రి ఎనిమిది గంటలదాకా సాగింది. పార్టీ కార్యాలయం ముందు పేమెంట్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు ఆడా, మగా, అందరు. అప్పుడు అడిగింది వెంకటమ్మ తన పక్కన కూర్చున్న విజయమ్మను.

“అత్తా! తమను గెలిపిస్తే పేదోళ్ళకు అది సేస్తాం- ఇది సేస్తాం అని చెపుతున్నారు. నిజంగా సేత్తారంటావా?” అంటూ అమాయకంగా.

“ఏందే పిచ్చిపిల్లా! ఈళ్ళు పెజాసేవ కోసం లక్షలూ- కోట్లూ- ఖర్చు సేస్తున్నారనుకుంటున్నావా? కాదమ్మా! ఇదో యాపారం. గెలిస్తే ఖర్చు సేసినదానికి పదింతలు సంపాదించుకోవచ్చని సేస్తున్నారు. ఈ పది రోజులూ ఆళ్ళ అవసరం కోసరం మనకు టిఫిన్లు- కాపీలు- అన్నాలు- డబ్బులు ఇచ్చారు. ఎన్నికలు అయిపోతే ఈళ్ళు మన మొకాలు సూడరు. ఇదంతా శాశ్వితం అనుకోకు. మూన్నాళ్ళ ముచ్చటే. మళ్ళీ మన పాచిపనులూ- అడుక్కోవటాలూ- మాత్రం శాశ్వితం-” అంది నవ్వుతూ విజయమ్మ.

- వెంకటమ్మ ఆమె మాటలకు బిత్తరపోయి ఆలోచనలో పడింది. ఏదేమయినా ఈ ఎన్నికల వల్ల కొన్ని అప్పులు తీర్తాయి,ఓ పదిరోజులు సుకంగా గడిచింది. తర్వాత ఎటూ పాత జీవితం- బతికే విధానం వుండనే వుందిగా” అనుకుని తృప్తి పడింది. ఈ లోగా పేమెంట్ ఇచ్చేవాడు వచ్చి అందరికీ డబ్బులు పంచసాగాడు. ఎరుకల కాలనీ ఆడాళ్లంతా మౌనంగా ఇళ్ళ దారి పట్టారు. దార్లో ఓ మహిళ కోపంగా “ఈ పేమెంటిచ్చే నా బట్ట రోజూ ఆలీసెంగానే వస్తాడు. ఇంకో అరగంట ముందొస్తే ఆడి సొమ్మేం పోతుందో?” అంది.

“ఆడి పెళ్ళాం ఈడు అరగంట కావలా కాయకపోతే ఆర్నెల్ల కడుపు తెచ్చుకునే బాపతేమో పాపం” అంది మరో ఎరుకలసాని హాస్యంగా- అందరూ నవ్వుకున్నారు.

***

ఆ మర్నాడు సాయంత్రానికి ఎన్నికల ప్రచారం ముగిసిపోయింది. రేపట్నించి రానవసరం లేదని పేమెంటిచ్చినవాడు ప్రకటించాడు. డబ్బు తీసుకుని ఇంటికి తిరిగి వచ్చింది వెంకటమ్మ. ఆమె కొండంత దిగులుతో ఇంటి ముందు నులక మంచంమీద కూర్చుంది. ఈ పూట అడుక్కోవటాన్కి కూడా వెళ్ళాలనిపించలేదు. రేపట్నించీ సంపాదన తగ్గిపోతుంది కదా అన్న దిగులు. సర్వస్వం కోల్పోయినంత దిగులు. ఆకలి కూడా అనిపించటం లేదు. కాలనీలో ఆడవాళ్ళందరూ అదే దిగుల్లో కూరుకునిపోయినట్లున్నారు. అంతటా నిశ్శబ్దంగా వుంది. ఓ గంట గడిచేసరికి మగాళ్ళంతా ఇళ్ళకు చేరటం ప్రారంభించారు. దాంతో సందడి కూడా ప్రారంభం అయింది. పూటుగా తాగివచ్చి బూతులు తిట్టేవాళ్ళు, పెళ్ళాల్ని చితకబాదేవాళ్ళు- లల్లాయి పదాలు పాడేవాళ్ళు- రకరకాల కోలాహలం-

వెంకటమ్మ భర్తా- కొడుకూ కూడా వచ్చేశారు రిక్షాలు తీసుకుని. వాళ్ళు రిక్షాలు తాళాలు వేసి వచ్చేలోగా, వెంకటమ్మ మంచంమీంచి లేచి ఆశ్చర్యపోతూ చూస్తోంది. తండ్రీ కొడుకులు ఇద్దరూ తాగి- పీకల్దారా పలావులు తినివస్తారనుకుంటే, పెద్ద మనుష్యుల్లా వచ్చారేమిటబ్బా అని. వాళ్ళు తాగి రాలేదు కానీ, అయిదు నిమిషాల్లో పెద్ద మనుష్యులం కాదని మాత్రం తేల్చేశారు.ఇద్దరూ చెరో ప్లాస్టిక్ బ్యాగూ తెచ్చి మంచాలమీద పెట్టుకున్నారు. అందులో రెండేసి విస్కీ బాటిల్సూ- రెండేసి బిర్యానీ ప్యాకెట్స్ బైటకు తీసారు- వెంకటమ్మ ఇద్దరికీ చెరో గ్లాసూ తెచ్చి ఇచ్చి, మంచాలకు దగ్గరగా ముక్కాలిపీట వేసుకుని కూర్చుంది.

“వణ్ణం తిన్నావా?” అన్నాడు కొడుకు. “ఛస్! దాని మొకం చూస్తే తెలవటంలా? అది రేపట్నించి డబ్బులు దొరకవని దిగులుతో తిండి తిన్నట్లు లేదు” అన్నాడు ఆమె భర్త. ఆమె కొడుకు నవ్వి “ఈ బిర్యానీ తినమ్మా” అని ఓ పొట్లం అందించాడు వెంకటమ్మకు- మౌనంగా అందుకుంది ఆమె. తండ్రీ కొడుకులిద్దరూ సీసాల్లోని ద్రవాన్ని గ్లాసుల్లో నింపుకుని తాగుతూ, బీడీలు తాగుతూ, కులాసాగా ఖుషీ అయిపోతున్నారు-

“ఒసే! ఎంకటీ దిగులు పడబాకు- అప్పుడే అయిపోలా? ఎన్నికల ప్రచారం మాత్రం అయిపోయింది. రేపు పనుండదు. రెస్ట్.ఎల్లుండి పనుండదు. కానీ రేపు రాత్రీ, ఎల్లుండి రాత్రీ ఆడూ- ఈడూ డబ్బులిస్తారు.

“మనం ఓటెయ్యాలి కదా! ఆడూ ఇస్తాడు. ఈడూ ఇస్తాడు. ఆరేడు వందలు వస్తాయి. తెలుసా రేపు” అన్న వెంకటమ్మ భర్త మాటలకు గొప్పగా సంతోషపడిపోయింది. తండ్రీ- కొడుకూ ఇద్దరూ ఫుల్‌గా

తాగి స్పృహ తప్పి నిద్రపోయారు.

రావాల్సిన ఆదాయం- పెద్దమొత్తం- ఓటు కొనేవాళ్ళు ఇస్తారు కదా!" అనుకుందామె. దాంతో ఆమెకు దిగులు తగ్గి ఆకలయింది. కొడుకు ఇచ్చిన బిర్యానీ పొట్లం తిని, అలసిపోయి కన్నారా నిద్రపోయింది ఆమె.

***

ఎన్నికలు అయిపోయి అప్పటికి నాల్గు రోజులు అయింది. ఎరుకల కాలనీ వాళ్ళ బతుకులు మళ్ళీ యథాప్రకారం మొదటికి వచ్చాయి. వెంకటమ్మ- ఇజయమ్మ కోమట్ల బజారులో ఓ చోట అడుక్కుంటూ తారసపడ్డారు.

"ఓట్లూ అయిపోయాయి. వాళ్ళిచ్చిన డబ్బులూ అయిపోయాయి. మన బతుకులు మళ్ళీ బజార్లో పడ్డాయత్తా" అంది వెంకటమ్మ దిగులుగా.

"ఓసి ఎర్రినా సెల్లెలా! మనం పుట్నాక ఎన్ని పండగలు రాలేదూ? ఎల్లిపోలేదూ? ఇవీ అంతేనే. మళ్ళీ అయిదేళ్ళదాకా ఆళ్ళు మనమొకమూ సూడరు, మనల్ని ఈ దరిద్రమూ వదలదు. ఎవరు గెల్చినా ఇంతేగందా జరుగుతోంది! పద పద ఆలీసెం అయితే ఈ అడుక్కునే మద్దు కూడా దొరకదు" అంది ఇజయమ్మ.

"అత్తా! అప్పుడప్పుడు పెట్టే కరువు పన్లలాగా, ఈ ఎలచ్చన్లు సంవత్సరం పొడుగునా పెడితే, మన బోటోళ్ళకు ఓ ముద్దేనా దొరుకుతంది కదా!" అన్న ఎంకటమ్మ మాటలకు ఇజయమ్మ నవ్వి-

"ధర్మం సెయ్యటం అంటే ఇనప్పెట్టెలో ఉన్నదంతా తీసి ఎవడూ ఇచ్చెయ్యడు. జేబులో ఉన్న కాసినిలోంచి, ఓ పావలానో, అర్ధో ఇస్తాడు. అయిదేళ్ళకోసారి ఆళ్ళు ఎన్నికల్లో సేసే కర్సూ అలాంటిదేనే. కాబట్టే లోకంలో కోటీశ్వరులూ- కూటికి లేనోళ్ళు- అనే తేడా" అంది. ఆ తర్వాత ఎవరి దోవన వాళ్ళు అడుక్కోవడానికి హడావిడిగా వెళ్ళిపోయారు.

***

ఆ తర్వాత కొన్ని నెలలు ఎండలకు మండిపోయారు. వానలకు తడిసిపోయారు. ఆకలికి అల్లాడిపోయారు. వానలకు కాలనీ మునిగిపోయింది. అడుక్కునే టయానికి వాన- పడుక్కునే టయానికి వాన. ప్రభుత్వం వారు కట్టించిన ఇచ్చిన జానా బెత్తెడు కొంపలో వెంకటమ్మ- భర్త- కొడుకు ముడుక్కుని పడుకోవాలి. విపరీతంగా దోమలు. ఇల్లంతా వాన- బైటంతా బురద- దుర్గంధం-

రాత్రి ఎనిమిది గంటలయింది. వాన కారణంగా అడుక్కోవటాన్కి పోలేదు. దానికితోడు చలిజరమేమో కొంచెం వళ్ళంతా నెప్పులు. ఈరోజు మొగుడు అన్నం లేనందుకు తంతాడు. ఆ రంధితో ఇంట్లో కురవకుండా వున్న కాస్త పొడిచోటు చూసుకుని కూర్చుంది. ఓ చిన్న కిరోసిన్ దీపం ఓ మూల మినుకుమినుకుమంటోంది. అదిగో అప్పుడొచ్చారు ఆమె భర్త- కొడుకు చెరో రిక్షా బురదలో కష్టంగా ఈడ్చుకుంటూ. వెంకటమ్మ ఆశ్చర్యపోయింది. రెండు రిక్షాలకు రెండు జండాలు తడిసి తలలు వేలాడేసున్నాయి. దీపం తీసుకుని గుమ్మంలో నిలబడిందామె. భర్త- కొడుకు- ఇద్దరూ చెరో పాలితిన్ కవరు ఆమె చేతిలో పెట్టి, కాళ్ళు కడుక్కురావటాన్కి తొట్టి దగ్గరకు వెళ్ళారు. ఈలోగా ఆమె గోడకు ఆనించివున్న నులకమంచం ఇంటిమధ్య వాల్చి, తండ్రీ కొడుకుల పాలితిన్ సంచులు దానిమీద పెట్టింది. వాటిలో మందుబాటిళ్ళూ- పలావ్ వాసన వస్తున్న పొట్లాలూ వున్నాయి. తండ్రీ కొడుకూ వచ్చి మంచంమీద కూర్చున్నారు. వెంకటమ్మ ఇద్దరికీ చెరో ఖాళీ గ్లాసూ అందించింది. గ్లాసులో మందు పోసుకుని చప్పరిస్తూ "ఎంకటీ! మళ్ళీ ఓ పదిరోజులు ఎన్నికల పని. మునిసిపల్ ఎన్నికలు. వాన పడుతోంది! అడుక్కోవటాన్కి ఎలా పోతావులే! ఇదిగో ఈ పొట్లం తిను" అంటూ ఆప్యాయంగా బిర్యానీ పాకెట్ అందించాడు ఆమె భర్త. వెంకటమ్మకు జరం తగ్గిపోయినట్లయింది. బిర్యానీ తిని నిద్రపోయింది. ఆమెకు ఆ రాత్రి ఎన్ని కలలో....!

# మాండలిక ధోరణి-దిశానిర్దేశం ఎటు?

బి.ఎస్.రాములు 'సాహిత్య చరిత్ర-తెలంగాణా దృక్పథం' (31 జూలై వార్త సంచిక) చదివిన తరవాత భాషాశాస్త్రవేత్తగా కొన్ని అంశాలకు స్పందించాలనిపించింది. అయితే ఇది రాసేసమయానికి మరోవారం 'చర్చ'లో (14.8.2005 నాటి వార్త సంచిక) టి.వెంకటేష్ 'పురోగమనమా? తిరోగమనమా?' అన్న శీర్షికలో సారూప్యమైన అంశాలను మరోరూపంలో వ్యక్తంచేశారు.

బి.ఎస్.రాములు వ్యక్తం చేసిన 'తెలంగాణా ప్రాపంచిక దృక్పథం' గురించి ఎటువంటి పేచీ లేదు. ఎటొచ్చీ భేదాభిప్రాయాలు వారు వ్యక్తం చేసిన 'భాష', 'మాండలికం' గురించి, దానితోపాటు కనబరిచిన తెలంగాణా మాండలికం/భాష అభిప్రాయాల గురించి.

ఆయన ఆధునిక సాహిత్యారంభం గురించి వివరిస్తూ గిడుగు రామమూర్తి కృషివల్ల వ్యావహారిక భాషా ఉద్యమం రూపొంది, ఉద్యమ ఫలితంగా శిష్టవ్యవహారం స్థిరపడిందన్నారు. బాగుంది. అయితే గ్రామీణప్రజలు మానవ సంబంధాల సంస్కృతిలో భాగంగా అవసరమైన భాషను సృష్టించుకొని వాడుకొంటున్నారు. దాన్ని 'గ్రామ్యమని కించపరిచారు' అని అంటున్నారు. కాని కించపరిచిందెవరు? కించపరిచింది ఈ సమాజమే అయితే అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, డా॥ దేవరాజు మహారాజు మొ॥ తెలంగాణా రచయితల మాండలిక రచనలకు ఉన్న స్థానం గురించి ఏం సమాధానం చెబుతారు?

తెలుగుభాష వ్యవహరించే ప్రాంతం అంతటా ద్విమాండలికత(బై డయ్‌లెక్టలిజమ్) విస్తరించి ఉంది. దానికి తోడుగా శైలీ మిశ్రమ స్థితి కొనసాగుతోంది. దీన్ని భాషా శాస్త్రవేత్తలు డయ్‌గ్లాసియా అని పిలుస్తారు. వీటివల్ల ఇంట్లో సొంత మాండలికం రాములు పరిభాషలో 'భాష' అనాలి, బయట మరో భాష రూపం- దీన్నే ప్రమాణభాష అనీ శిష్టవ్యవహారం అనీ శిష్ట వ్యావహారికం అనీ ఎన్నో పేర్లతో పిలుస్తున్నారు.

చర్చ

యూరప్ దేశాల చరిత్ర ప్రస్తావన తెస్తూ అక్కడి భాషల పరిస్థితి వివరించారు. అక్కడ పరిస్థితి అయినా అంతే. యూరోపియన్ భాషల్లో చారిత్రకంగా ఈ దశలు దాటి ఒక బేస్ ఏర్పడింది. అది మన తెలుగు భాషలో ఇంకా ఏర్పడలేదు. ఇటీవల జరిగిన 'తెలుగుభాష ఆధునికీకరణ' చర్చాగోష్ఠిలో చేకూరి రామారావు అన్నట్లు చరిత్ర యూరోపియన్ భాషలకు సమస్యలను తీరుస్తే, అదే చరిత్ర మన భాషకు సమస్యలను తెచ్చిపెట్టిందన్నది నిజం.

'తెలంగాణ వ్యావహారికభాష' రూపొందించకముందే బ్రిటిషాంధ్రులు ఆధిపత్యం చేయడంవల్ల, గ్రాంథికవాదాన్ని పట్టుకు వేలాడటంవల్ల తెలంగాణలో తెలంగాణ వ్యావహారిక భాష రూపు దిద్దుకోవడం ఆలస్యమైందన్నది రాములు వాదన. అంటే అప్పుడు నైజాం పరిపాలనలో తెలంగాణలో తెలుగు మాండలికమే లేదనుకోవాల్సి వస్తుంది. కాని వాస్తవానికి అప్పట్లో ఉర్దూ ప్రభావితమైన తెలంగాణ మాండలికం వ్యవహారం ఉంది. అయితే అది 'శిష్ట వ్యవహార' స్థితికి ఎదగలేదంతే. ఏ వ్యక్తో లేదా వర్గమో బలవంతంగా ఒక మాండలికాన్ని లేదా ఒక వర్గం వారి భాషను బలవంతంగా సమాజం మొత్తం వ్యవహారంలో ఉండేలా చేయలేరు. చారిత్రకావసరాల దృష్ట్యా ఎదిగిన వ్యవహారం రూపం సామాజికామోదంతో స్వేచ్ఛాయుతంగా బహుళ వినియోగరూప స్థాయికి చేరుకొంటుంది. ఆ రూపమే చలామణిలో ఉంటుంది. ఇప్పటి 'శిష్ట వ్యవహారం' పరిస్థితి అదే. తెలంగాణవారు మాతృభాషలో చదువుకోలేకపోవడానికి కారణం అప్పటి రాజకీయ, సామాజిక పరిస్థితులే కాని రాములు భావిస్తున్నట్లు బ్రిటిషాంధ్ర శిష్టవ్యావహారిక భాష కాదు. సాహిత్య సృజనకు, ఇతర ప్రత్యేక ప్రయోజనాలకు వినియోగపడే మాండలికాన్ని, పాఠ్యగ్రంథాలు, శాస్త్ర రచనలు, వార్తా పత్రికల వ్యవహారం, ఇతర ప్రసార మాధ్యమాలలో వినియోగంలో ఉన్న భాషారూపంతో పోల్చకూడదు. ఈ భాషా రూపం విస్తృతి, ప్రయోజనాలు వేరు. మాండలికాల్లో ఇవి వెలువడితే భాషా ప్రయోజనం దెబ్బతిని పరస్పర భావ ప్రసార యోగ్యత కొరవడుతుంది. ఒకవిధంగా తెలుగుభాషా సమాజం ఉనికికే హాని చేస్తుంది. ఒకవేళ ఆ విధంగా జరిగితే టి.వెంకటేష్ అన్నట్లు తిరోగమనమే కాకుండా అయోమయావస్థ ఏర్పడుతుంది. తెలుగు భాషా సమాజంలో ఇమిడివున్న ప్రాంతీయ వ్యవహారాలు, సామాజిక మాండలికాలు, భిన్నశైలులు అందరికీ కాకపోయినా మేధావివర్గాలకయినా స్పష్టపరిస్తే- భాషావేత్తలు ఈ దిశగా కృషిచేస్తే 'భాష' పట్ల, 'మాండలికాల' పట్ల ఉండే దురభిప్రాయాలు తొలగిపోయే అవకాశం ఉంటుంది.

- డా॥ కుంటుముక్కల లక్ష్మీనారాయణ శర్మ